సాక్షి ఖమ్మం

ఆదివారం । 30 । జూలై । 2023



ఇంకా ఉత్కంఠే

భద్రాచలంలో గోదావరి మూడో ప్రమాద హెచ్చరికను దాటి పెరుగుతుండడంతో ముంపు ప్రాంత ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. 8లో



భక్తిశ్రద్ధలతో మొహర్రం

జిల్లావ్యాప్తంగా ముస్లింలు మొహర్రంను భక్తిశ్రద్ధలతో జరుపుకోగా, పీరీల ఊరేగింపులో కులమతాలకతీతంగా పాల్గొన్నారు. 9లో

గరిష్టం / కనిష్టం
32° / 25°

వాతావరణం

జిల్లాలోని ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల ఓ మోస్తరు వర్షపాతం నమోదయ్యే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఆర్టీసీకి కొనసాగుతున్న నష్టాలు

పలు సర్వీసుల రద్దుతో తగ్గిన ఆదాయం

ఖమ్మం మామిళ్లగూడెం: వరుస వర్షాలతో వరద ముంపునకు గురైన ప్రాంతాలకు ఆర్టీసీ మూడు రోజులుగా సర్వీసులు రద్దు చేస్తోంది. ఈమేరకు శనివారం ఖమ్మం ఆర్టీసీ రీజియన్ పరిధిలోని పలు సర్వీసులు రద్దు చేయగా రూ.7లక్షల నష్టం వాటిల్లింది. రోజూ రావాల్సిన రూ.95లక్షల ఆదాయానికి బదులు రూ.88 లక్షల ఆదాయం సమకూరింది. రీజియన్‌లోని ఆరు డిపోలకు సంబంధించి భద్రాచలం నుంచి ఇరవై సర్వీసులు, ఖమ్మం నుంచి ఆరు, మణుగూరు నుంచి ఐదు, సత్తుపల్లి నుంచి నాలుగు, కొత్తగూడెం నుంచి మూడు, మధిర డిపో నుంచి ముంపు ప్రాంతాలకు వెళ్లాల్సిన రెండు సర్వీసులను రద్దు చేయగా, సుదూర ప్రాంతాలకు యథావిధిగా రాకపోకలు సాగుతున్నాయని అధికారులు తెలిపారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవారి పాదంతో పాటు స్వామి మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అలాగే, స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి వేలాదిగా హాజరైన భక్తుల నడుమ అర్చకుడు వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి నిత్యకల్యాణాన్ని జరిపించారు. అనంతరం పల్లకీ నిర్వహించగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల మన్ననలు పొందేలా పనిచేయాలి



పురస్కారాలు అందుకున్న ఉద్యోగులతో ఆర్‌ఎం వెంకన్న, అధికారులు

ఖమ్మంమామిళ్లగూడెం: ఆర్టీసీపై నమ్మకంతో వచ్చే ప్రయాణికుల మన్ననలు పొందేలా ఉద్యోగులు పనిచేయాలని ఖమ్మం రీజినల్ మేనేజర్ సీహెచ్ వెంకన్న సూచించారు. 'ప్రగతి చక్రం – త్రైమాసిక పురస్కారాలు' పేరుతో ఆర్టీసీ వివిధ విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన ఉద్యోగులకు శనివారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో ఆర్‌ఎం నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం వెంకన్న మాట్లాడుతూ అత్యుత్తమ పనితీరుతో త్రైమాసిక పురస్కారాలు పొందిన ఉద్యోగులను మిగిలిన వారు ఆదర్శంగా తీసుకుని సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఖమ్మం ఇన్‌చార్జ్ డీఎం దేవదానం, మణుగూరు డీఎం స్వామి, రామారావు, సీఐలు శ్రీనివాస్, రామయ్య, రాజ్యలక్ష్మి, వీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై ఉక్కుపాదం



పోస్టర్లు విడుదల చేస్తున్న అదనపు డీసీపీ బోస్, తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: మానవ, పిల్లల అక్రమ రవాణా జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని ఆదివారం జరుపుకోనుండగా, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, చైల్డ్‌లైన్, షేర్ సంస్థ ఆధ్వర్యాన వాల్‌పోస్టర్లను శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అందరూ అప్రమత్తంగా ఉండి అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరారు. ఇలాంటి విషయాల్లో సమాచారం తెలిస్తే 100, 1098 నంబర్లకు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని సూచించారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భారతరాణి మాట్లాడుతూ బాలబాలికలను రక్షితంగా ఉండేలా తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని తెలిపారు. చైల్డ్‌లైన్ జిల్లా సమన్వయకర్త కె.శ్రీనివాస్, ఏహెచ్‌టీయూ బాధ్యులు నర్సింహారావుతో పాటు విజయ్‌కుమార్, సురేష్, కై లాష్, సత్యవతి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



కూసుమంచి మండలం పాలేరులోని పొలంలో వేసిన ఇసుకమేట

పంట పొలాల్లో ఇసుకదిబ్బలు

పాలేరు రిజర్వాయర్ అలుగు పారడంతో ఏరు ఉప్పొంగింది. ఏటి పరీవాహక ప్రాంతాలైన పాలేరు, భగవత్‌వీడు, హట్యాతండా, మల్లాయిగూడెం, రాజుపేట, జక్కేపల్లిల్లోని పొలాలు నీట మునగడంతోపాటు ఇసుక మేటలు వేశాయి. మరికొందరు రైతుల పొలాల్లో వరినారు కొట్టుకుపోయి మట్టి కోతకు గురైంది. దీంతో మళ్లీ ట్రక్కులు పెట్టి మట్టి పోయించాలంటే ఒక్కో రైతు రూ.లక్ష ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. పాలేరు ఏటి పరిధిలోనే 50 ఎకరాల వరకు ఇలా దెబ్బతిన్నది.



ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకిన మున్నేరు వరద

విద్యుత్ శాఖకు రూ.40 లక్షలు నష్టం

విద్యుత్ శాఖకూ వరదలు రూ.40 లక్షల మేర నష్టాన్ని మిగిల్చాయి. వాగుల వెంట లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. ఎన్పీడీసీఎల్ పరిధిలో 45 ట్రాన్స్‌ఫార్మర్లు పాడవగా.. వంద స్తంభాలు విరిగిపోయాయి. మున్నేరుతో పాటు పాలేరు, వైరా రిజర్వాయర్ పరీవాహకంలో ఎక్కువ నష్టం జరిగింది. ఖమ్మంలో కాల్వొడ్డు మినహా అన్ని ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరించినట్లు ఎస్ఈ సురేందర్ తెలిపారు.

వాన మిగిల్చిన వేదన

భారీ వర్షాలు, వరదలతో అపారనష్టం

- పంట పొలాల్లో భారీగా ఇసుకమేటలు
- మున్నేరు, పాలేరు, వైరా పరీవాహకంలో ప్రభావం
- ఖమ్మం డివిజన్‌లో 32 ప్రాంతాల్లో కోతకు గురైన రోడ్లు
- నేలకొరిగిన స్తంభాలు, నీటమునిగిన ట్రాన్స్‌ఫార్మర్లు

భారీ వర్షాలు, వరదలతో తీరని నష్టం ఏర్పడింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో పది రోజుల పాటు కురిసిన వర్షాలతో తొలి దశలో ఉన్న పంటలు నీట మునిగాయి. అలాగే, పలుచోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. విద్యుత్ స్తంభాలు నేలకూలి, ట్రాన్స్‌ఫార్మర్లు మునిగిపోయాయి. అంతేకాక సాగర్ కాల్వలు కూడా దెబ్బతినగా కొన్ని చోట్ల చెరువు కట్టలు తెగిపోయాయి. మున్నేరు, పాలేరు, వైరా రిజర్వాయర్ల పరీవాహక ప్రాంతాల్లో నష్ట తీవ్రత అధికంగా ఉంది. అంతేకాక కాలనీలు, ఇళ్లతో పాటు పంట పొలాల్లో ఇసుక మేట వేసింది.
– సాక్షి ప్రతినిధి, ఖమ్మం

ముంచిన వరుణుడు

జూన్‌లో వర్షాభావ పరిస్థితులతో రైతులు పంటల సాగుకు ధైర్యం చేయలేదు. ఈనెల మొదట్లో మొదలైన వర్షాలతో వేసిన కొద్దిపాటి పంటలను ఇప్పుడు భారీ వర్షాలు నేలమట్టం చేశాయి. మున్నేరు, పాలేరు, వైరా రిజర్వాయర్లు ఉప్పొంగడంతో పరీవాహక ప్రాంతాల్లోని పంట పొలాలన్నీ నీటమునిగాయి. ప్రధానంగా పత్తి, వరి, పెసర పంటలను రైతులు సాగు చేయగా... పత్తి మొక్కలు, వరి, మిరప నారు కొట్టుకుపోయి పొలాల్లో ఇసుక మేట వేయడమే కాక మట్టి కోతకు గురైంది. అంతేకాక బోర్లు, స్టార్టర్లు కొట్టుకుపోయాయి. మున్నేరు పరీవాహక ప్రాంతాలైన ఖమ్మం రూరల్, ఖమ్మం అర్బన్, ముదిగొండ, చింతకాని తదితర మండలాల్లో 1,052 ఎకరాల్లోని 716 మంది రైతులకు చెందిన వరి నీట మునిగినట్లు అంచనా. అలాగే, 1,926 ఎకరాల్లో 1,233 మంది రైతులకు సంబంధించి పత్తి పూర్తిగా దెబ్బతిన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక సర్వే ఆధారంగా నివేదిక సిద్ధం చేశారు.

దెబ్బతిన్న రోడ్లు

జిల్లాలోని పలుచోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. ప్రధానంగా ఖమ్మం డివిజన్‌లో 32 ప్రాంతాల్లో 100 కిలోమీటర్లకు పైగా ఆర్‌అండ్‌బీ రోడ్లు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. వాగుల క్రాసింగ్ ఉన్న ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. ఆయా రోడ్ల మరమ్మతులకు సుమారు రూ.50 కోట్ల వరకు అవసరముంటుందని అంచనా వేశారు. కొణిజర్ల మండలం లాలాపురం–తీగలబంజర మధ్య పగిడేరుపై నిర్మించిన బ్రిడ్జి వద్ద ఏడాది క్రితం రోడ్డు నిర్మాణం చేపట్టగా తాజా వరదలతో కొట్టుకుపోయి దాదాపు అడుగు లోతు గుంతలు ఏర్పడ్డాయి. ఏన్కూరు నుంచి పల్లిపాడు మీదుగా ఖమ్మం వచ్చే రోడ్డు ధ్వంసం కాగా, ఖమ్మం–డోర్నకల్ మధ్య వాగు పొంగి పొర్లడంతో ఆయా ప్రాంతాల్లో కూడా రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. తల్లాడ మండలం మంగాపురం–గొల్లగూడెం మధ్య సుమారు 50మీటర్ల మేర దెబ్బతిన్న రహదారి మరమ్మతులకు రూ.30 లక్షలతో అధికారులు ప్రతిపాదనలు పంపారు.



కొణిజర్ల మండలం లాలాపురం–తీగలబంజర మధ్య పగిడేరు బ్రిడ్జిపై రోడ్డు పరిస్థితి

సాక్షి ఫోకస్



ఏన్కూరు మండలంలో వాగు ఉధృతికి కొట్టుకుపోయిన పత్తి చేను

సాగర్ కాల్వలకూ తప్పనిముప్పు

జిల్లాలోని ప్రధాన సాగు నీటి వనరైన నాగార్జున సాగర్ కాల్వలు కూడా పలుచోట్ల దెబ్బతిన్నాయి. అలాగే చెరువు కట్టలు ధ్వంసమయ్యాయి. సింగరేణి మండలం సంగంకుంట చెరువు కట్ట తెగడంతో మరమ్మతులకు రూ.6 లక్షలు అవసరమని అంచనా వేశారు. పెనుబల్లి మండలంలో సాగర్ ప్రధాన కాల్వ 88వ కి.మీ. వద్ద యూటీ(అండర్ టన్నెల్) రిటైనింగ్ వాల్ దెబ్బతినగా రూ.25 లక్షలు, ముదిగొండ మండలం లక్ష్మీపురం వద్ద సాగర్ కాల్వ క్రాస్ రెగ్యులేటర్ దెబ్బతినడంతో తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.8.50 లక్షలు, శాశ్వత పనుల కోసం రూ.60 లక్షలు అవసరం అవుతాయని ప్రతిపాదనలు సిద్ధం చేశారు.



పెనుబల్లి మండలంలో దెబ్బతిన్న అండర్ టన్నెల్ రిటైనింగ్ వాల్



కారేపల్లి మండలం సంగంకుంట చెరువు కట్ట తెగడంతో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

రెండెకరాల నారు కొట్టుకుపోయింది..



వారం క్రితం రెండు ఎకరాల్లో వరి నాట్లు వేశాం. ఈలోగా పాలేరు ఏరు పొంగడంతో మొత్తం కొట్టుకుపోయింది. నారుతో పాటు పొలంలో ఆరు అడుగుల లోతు మట్టి కూడా కోతకు గురైంది. వరద కారణంగా రూ.50వేల నష్టం జరగగా, పొలాన్ని సరి చేయాలంటే మరో రూ.లక్ష వెచ్చించాలి.
– పందుల వెంకన్న, పాలేరు, కూసుమంచి మండలం

ప్రభుత్వమే ఆదుకోవాలి..



ఆకేరు వరద పంటలకు తీవ్ర నష్టం చేకూర్చింది. వరద ధాటికి 60 ప్యాకెట్ల మిర్చి నారు, రెండు ఎకరాల వరి పొలం కొట్టుకుపోయింది. ప్రస్తుతం పొలంలో ఇసుక మేట వేసింది. మొత్తంగా రూ.2 లక్షల వరకు నష్టం జరిగినందున ప్రభుత్వం సర్వే చేసి నాలాంటి రైతులను ఆదుకోవాలి.
– భూక్యా సునీల్, బీసురాజుపల్లి తండా, తిరుమలాయపాలెం మండలం

నాలుగెకరాల్లో ఇసుకమేట



నాలుగు ఎకరాల కౌలు భూమిలో పత్తి నాటాను. కౌలు, పెట్టుబడి ఎకరానికి రూ.30 వేల చొప్పున రూ.1.20 లక్షలైంది. భారీ వర్షానికి మూలపోచారం, రంగాపురం మధ్య వాగు పొంగి వరద వచ్చి ఇసుక మేట వేసింది. మళ్లీ సాగు చేద్దామన్నా ఇసుక ఉండడంతో ఏమీ చేయలేని పరిస్థితి.
– బానోతు శ్రీరాములు, రాంనగర్ తండా, ఏన్కూరు మండలం



తిరుమలాయపాలెం మండలం బీసురాజుపల్లిలోని కోతకు గురైన పొలం

కాకరకాయ పంచనోళ్లవి కబుర్లే..



బాధితులకు సరుకులు అందజేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్, ఎంపీలు రవిచంద్ర, నాగేశ్వరరావు

- వరద బాధితులకు అండగా ఉంటాం
- రూ.147 కోట్లతో మున్నేరుకు ఆర్‌సీసీ వాల్ నిర్మాణ ప్రతిపాదనలు
- హెల్త్ క్యాంపు ప్రారంభంలో మంత్రి పువ్వాడ అజయ్



బాధితురాలిని ఓదారుస్తున్న మంత్రి అజయ్

ఖమ్మంమయూరిసెంటర్: వరదలతో తల్లడిల్లుతున్న ప్రజలకు కనీసం కాకరకాయ పంచనోళ్ల కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని రాష్ట్ర రవాణశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మండిపడ్డారు. ఖమ్మంలో మున్నేరు వరద బాధిత ప్రజలకు పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యాన వైద్యశిబిరం ఏర్పాటుచేయగా మంత్రి ప్రారంభించారు. అలాగే, ఫౌండేషన్ ఆధ్వర్యాన వెయ్యి కుటుంబాలకు నిత్యావసర సరుకులు, కార్పొరేటర్ తోట గోవిందమ్మ–తోట రామారావు ఆధ్వర్యాన కూరగాయల పంపిణీని ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్రతో కలిసి మంత్రి పువ్వాడ ప్రారంభించి మాట్లాడారు. ఖమ్మం ఎల్లలు తెలియని వారు నేడు రాజకీయం చేయడానికి వస్తున్నారని, కాంగ్రెస్ పాలనలో ప్రజలను మరిచి ఇప్పుడు అధికారంలోకి వస్తే కరకట్ట నిర్మిస్తామని చెప్పడం గర్హనీయమన్నారు. అయితే, కరకట్ట నిర్మిస్తే భవిష్యత్‌లో ప్రమాదం ఎదురయ్యే అవకాశమున్నందున మున్నేరుకు ఇరువైపులా ఆర్‌సీసీ వాల్ నిర్మించేందుకు ఇప్పటికే రూ.147 కోట్లతో సిద్ధమైన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సమర్పిస్తామని తెలిపారు. ఎవరెన్ని రాజకీయాలు చేసినా మున్నేరు వరద ముంపు బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. మును పెన్నడూ లేని విధంగా మున్నేరు ఉధృతరూపం దాల్చినా ప్రజలను కాపాడుకున్నామని, సామగ్రి నష్టపోయిన వారికి తమ వంతు సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం, మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల్ల వెంకటేశ్వరరావు, మునిసిపల్ డిప్యూటీ కమిషనర్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కేయూ పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి లో ఆది, సోమవారాలతో పాటు ఆగస్టు 1, 2వ తేదీల్లో జరగాల్సిన పరీక్షలను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి వెల్లడించారు. భారీ వర్షాలతో పలు మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయిన నేపథ్యాన ఈ నిర్ణయం తీసుకన్నాట్లు తెలిపారు. బీ ఫార్మసీ, ఫార్మా డీ, బీఏ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ సెమిస్టర్ పరీక్షలే కాకుండా పీజీ కోర్సుల నాలుగో సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలు, లా చివరి సంవత్సరం విద్యార్థులకు మూట్ కోర్టు పరీక్షలు వాయిదా వేశామని పేర్కొన్నారు. ఆయా పరీక్షలు మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

సంక్షోభంలో పాఠశాల విద్య



మాట్లాడుతున్న దుర్గాభవాని

ఖమ్మంసహకారనగర్: రాష్ట్రంలో పాఠశాల విద్య తీవ్ర సంక్షోభంలో ఉందని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని పేర్కొన్నారు. ఖమ్మంలో శనివారం సంఘం జిల్లా అధ్యక్షుడు జీవీ. నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారుల పర్యవేక్షణ లోపించడమేకాక హెచ్‌ఎంలు, సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతతో ప్రభుత్వ విద్యావ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. పదోన్నతులు, బదిలీల ప్రక్రియ నిలిచిపోయినందున, ఎన్నికల కోడ్ రాకముందే పదోన్నతులనైనా కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే, పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేసి, ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలన్నారు. ఇంకా కేజీబీవీ, మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాతపెన్షన్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావుతో పాటు మహబూబ్, బుర్రి వెంకన్న, షమీ, వల్లంకొండ రాంబాబు, గీత, నిర్మలాకుమారి, రాందాస్, సుధాకర్, నరసయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధికారంలోకి రావడం కల

- గోదావరి, మున్నేరుకు ఆర్‌సీసీ వాల్స్ నిర్మిస్తాం
- కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



బాధితులకు సరుకులు అందజేస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి

ఖమ్మంమయూరిసెంటర్: రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావడం కలేనని కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మంలో మున్నేరు ముంపు బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీలో భాగంగా బొక్కలగడ్డలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది భద్రాచలంలో వరదల సందర్భంగా సీఎం కేసీఆర్ రూ.వెయ్యి కోట్లు ప్రకటించినా రూపాయి ఇవ్వలేదని ఆరోపించారు. ఇళ్లు కోల్పోయిన వారికి కొత్త ఇళ్లు, పాడైపోయిన ఇళ్లను మరమ్మతుల హామీని కూడా విస్మరించారని తెలిపారు. ఇవన్నీ పక్కనపెట్టి రానున్న ఎన్నికల్లో తమను గెలిపిస్తే భవనాలు నిర్మిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని ఆరోపించారు. ఏదిఏమైనా రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, ఆ వెంటనే భద్రాచలం, ఖమ్మంలో గోదావరి, మున్నేరుకు ఆర్‌సీసీ వాల్స్ నిర్మిస్తామని తెలిపారు. కాగా, ఇళ్లు కూలిన వారికి రూ.25వేల చొప్పున, వరదల కారణంగా చనిపోయిన వారి కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని పొంగులేటి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబుతో పాటు నాయకులు మద్దినేని బేబి స్వర్ణకుమారి, దొడ్డా నగేష్ యాదవ్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, చావా శివరామకృష్ణ, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, బాణాల లక్ష్మణ్, కొప్పెర ఉపేందర్, షేక్ ఇమామ్, మందడపు తిరుమలరావు, కొంగర జ్యోతిర్మయి, చింతమళ్ల గురుమూర్తి, నవాజ్, బీరేష్, రామకృష్ణ, తుపాకుల మధు, నాగరాజు, మధుసూదన్‌రెడ్డి, బోజెడ్ల సత్యనారాయణ పాల్గొగన్నారు.

ఆస్తి, ప్రాణనష్టం ప్రభుత్వ వైఫల్యమే...

సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క



మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

వైరా: వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు సంభవించిన ఆస్తి, ప్రాణనష్టానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. భద్రాచలంలో ముంపు ప్రాంతాలను పరిశీలించేందుకు వెళ్తున్న ఆయన మంగళవారం వైరాలో విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించినా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికార యంత్రాంగాన్ని బీఆర్ఎస్ పార్టీ అవసరాల కోసమే వాడుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా ముంపు ప్రాంతాల్లో శాశ్వత చర్యలు చేపట్టాలని భట్టి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు శీలం వెంకటనర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎంటెక్‌లో ఖమ్మం వాసి ప్రతిభ



ఎంటెక్ పట్టా అందుకుంటున్న ఫణిసాయి

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం మామిళ్లగూడెంకు చెందిన దిడుగు ఫణిసాయి గణేష్ తమిళనాడులోని తిరుచిరాపల్లి ఎన్ఐటీలో ఎంటెక్ డేటా అనాలిటిక్స్ పూర్తిచేయగా, 9.73 జీపీఏతో బంగారు పతకం సాధించాడు. గతంలో ఖరగ్‌పూర్ ఐఐటీలో బీటెక్ చేస్తుండగానే బెంగళూరులోని ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం సాధించాడు. ఆతర్వాత ఎంటెక్‌లో చేరి సత్తా చాటిన ఆయన తాజాగా ఫస్ట్ క్లాస్ డిస్టింక్షన్ సాధించి బంగారు పతకం అందుకున్నాడు.

బీజేపీని గద్దె దించడమే ప్రధాన లక్ష్యం

ఖమ్మంమయూరిసెంటర్: దేశ సమైక్యత, సమగ్రతకు ముప్పు తీసుకొస్తున్న బీజేపీని గద్దె దించడమే తమ ప్రధాన లక్ష్యమని, ఇందుకోసం కమ్యూనిస్టులు ఐక్యంగా పని చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్ పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఖమ్మంలోని సుందరయ్య భవనంలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వెంకట్, సీఐటీయూ నాయకుడు రమేష్‌కుమార్ మక్కడ్ మాట్లాడుతూ మతం, కులం, భాష, సంస్కృతి, ఆహార అలవాట్ల పేరుతో బీజేపీ ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతోందని ఆరోపించారు. ఆ పార్టీని గద్దె దింపడానికి లౌకిక, ప్రజాస్వామ్య, ప్రగతిశీల పార్టీలన్నీ ఏకమవుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు యర్రా శ్రీకాంత్, పి.వెంకటేశ్వరరావు, రమేష్, విక్రమ్, బుగ్గవీటి సరళ, చింతలచెర్వు కోటేశ్వరరావు, బండి రమేష్, మాచర్ల భారతి, బొంతు రాంబాబు, కళ్యాణం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్లు పంపిణీ



గొర్రెలు అందజేస్తున్న డీసీసీబీ, జెడ్పీ చైర్మన్లు

ముదిగొండ: గొల్ల, కుర్మలకు రెండో విడత గొర్రెల యూనిట్ల పంపిణీ మొదలైంది. ఈసందర్భంగా ముదిగొండ మండలం పండ్రేగుపల్లిలో 18మంది లబ్ధిదారులకు డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు శనివారం యూనిట్లు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గొర్రెల యూనిట్లను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగాఎదగాలని సూచించారు. జెడ్పీటీసీ పసుపులేటి దుర్గ, సర్పంచ్ ఓబినబోయిన అమరయ్య, పశు వైద్యాధికారి అశోక్‌తో పాటు నానబాల మాధవి, మీగడ శ్రీనివాస్‌యాదవ్, పాము శిల్పరాజు, పసుపులేటి వెంకట్, బత్తుల వీరారెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ కుప్పకూలిన స్టేషన్ ప్రహరీ

కారేపల్లి: నిర్మాణంలో ఉన్న రైల్వేస్టేషన్ ప్రహరీ మళ్లీ కూలింది. కారేపల్లి మండలం గాంధీపురం వద్ద నూతనంగా రైల్వేస్టేషన్ నిర్మిస్తుండగా తరచుగా లోపాలు బయటపడుతున్నాయి. సుమారు రూ.9 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రైల్వే స్టేషన్ పనుల్లో భాగంగా ప్లాట్‌ఫాం, ప్రహరీ ఈ నెల 13వ తేదీన కూలాయి. తిరిగి నిర్మిస్తుండగా వరుసగా కురుస్తున్న వర్షాలతో శుక్రవారం రాత్రి మరోసారి ప్రహరీ కూలిపోయింది. అలాగే, ప్లాట్‌ఫాంకు సైతం బీటలు వారాయి. ఇప్పటికైనా పనుల్లో నాణ్యత పాటించేలా అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

పరిహారం అందించి ఆదుకోండి

ఖమ్మంమయూరిసెంటర్: భారీ వర్షాలతో నష్టపోయిన వారందరికీ ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వర్షాలు, వరదలతో వందలాది ఎకరాల్లో పంటలు నష్టపోగా, పలుచోట్ల భూములు కోతకు గురయ్యాయని తెలిపారు. రైతులకు ఎకరానికి రూ.25 వేలు, ఇళ్లు, సామగ్రి నష్టపోయిన వారికి తక్షణ సాయంగా రూ.10 వేలు అందించాలని పేర్కొన్నారు. ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పోలేపల్లి గుట్టల్లో క్షుద్ర పూజలు ?!

ఖమ్మంరూరల్: మండలంలోని పోలేపల్లి సాకరాయి గుట్టపై గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి క్షుద్ర పూజలు నిర్వహించారు. అక్కడ కొబ్బరికాయలు, నిమ్మకాయలు, పసుపు, కుంకుమతో పూజలు చేసినట్లు ఆనవాళ్లు ఉండగా, స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ నాగుల్‌మీరా చేరుకుని పరిశీలించారు. ఆధునిక సమాజంలో ఇలాంటి మూఢ నమ్మకాలను విశ్వసించొద్దని ఆయన స్థానికులకు అవగాహన కల్పించారు.

ఇంకా ఉత్కంఠే..



భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

- ఎగువ నుంచి 13లక్షల క్యూసెక్కుల వరద
- రాత్రి 12 గంటలకు 56.10 అడుగుల నీటిమట్టం
- కొనసాగుతున్న సహాయక శిబిరాలు అప్రమత్తంగా అధికార యంత్రాంగం



భద్రాచలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి (ఇన్‌సెట్) నీటిమట్టం సూచిక

భద్రాచలం : గోదావరి నదికి వరద ప్రవాహం పెరుగుతుండడంతో తీర ప్రాంత వాసుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. స్థానికంగా వర్షాలు తగ్గినా ఎగువ నుంచి వరద వస్తుండడంతో గోదావరి శాంతించడం లేదు. అయితే అంతే స్థాయిలో వరద దిగువకు వెళుతుండడంతో భద్రాచలం వద్ద నీటిమట్టం నెమ్మదిగా పెరుగుతోంది. వరద తీవ్రత, తీసుకోవాల్సిన చర్యల గురించి రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ ప్రియాంక ఆల ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. ఐఏఎస్ అధికారి దురిశెట్టి అనుదీప్, ఎస్పీ డాక్టర్ జి.వినీత్, ఏఎస్పీ పరితోశ్ పంకజ్, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ తదితరులు సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

నేడూ వరద పోటు..

శనివారం రాత్రి 12 గంటల సమయంలో భద్రాచలం వద్ద గోదావరి 15,96,899 క్యూసెక్కుల నీటి ప్రవాహం దిగువకు వెళుతుండగా నీటి మట్టం 56.10 అడుగులుగా ఉంది. గోదావరికి ఎగువ ప్రాంతాన ఉన్న సమ్మక్క బ్యారేజీ వద్ద నీటిమట్టం శనివారం రాత్రి 9 గంటలకు 13 లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. సమ్మక్క బ్యారేజీ భద్రాచలనికి ఎగువన 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడ శనివారం మధ్యాహ్నం వదిలిన గరిష్ట వరద భద్రాచలం చేరేందుకు 24 గంటల సమయం పడుతుంది. దీంతో ఆదివారం మధ్యాహ్నం వరకు వరద పోటు కొనసాగే అవకాశం ఉంది. గరిష్ట వరద భద్రాచలం చేరుకునే సమయానికి నీటి మట్టం 60 అడుగుల వరకు చేరుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి భద్రాచలం దగ్గర నీటి మట్టం 53 అడుగుల దిగువకు తగ్గి, ఎగువ నుంచి వరద రాకుంటే పునరావాస శిబిరాల నుంచి ఇళ్లకు వెళ్లేందుకు ముంపు బాధితులకు అనుమతి ఇస్తామని అధికారులు చెబుతున్నారు.



భద్రాచలం సమీపాన అధికారులతో వరదపై సమీక్షిస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ప్రాణం తీసిన ఫ్లెక్సీ ఫ్రేమ్

- షాక్‌తో 'నవోదయ' విద్యార్థి మృతి
- బంధువులు, కుటుంబీకుల ఆందోళన
- ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ వేటు



గాయాలతో బయపడిన ఈశ్వర్

కూసుమంచి/ఖమ్మంవైద్యవిభాగం: మరో నాలుగు రోజుల్లో రీజినల్ స్థాయి క్రీడాపోటీలు జరగనున్నాయి. దేశవ్యాప్తంగా నవోదయ విద్యాలయాల నుంచి విద్యార్థులు హాజరుకానున్న పోటీల్లో తాము సైతం పాల్గొంటామని ఉత్సాహంగా ఉన్న విద్యార్థుల్లో ఒకరు విద్యుదాఘాతంతో మృతి చెందడం విషాదాన్ని నింపింది. వివరాలు.. పాలేరులోని నవోదయలో వచ్చేనెల 3వ తేదీ నుంచి రీజినల్ స్థాయి క్రీడా పోటీలు జరుగనున్నాయి. దీంతో శనివారం సాయంత్రం ఫ్లెక్సీల ఏర్పాటుకు 12వ తరగతి విద్యార్థులు హలావత్ దుర్గానాగేందర్, శ్రీకుమార్.. ఈశ్వర్‌తో కలిసి ఇనుప ఫ్రేమ్ తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో ఫ్రేమ్ పైన ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలను తాకడంతో నాగేందర్ పడిపోగా, మిగిలిన ఇద్దరు షాక్ గురైనా తేరుకున్నారు. దీంతో స్థానికులు, ఉద్యోగులు నాగేందర్‌ను ఓ వ్యాపారి కారులో ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో అంబులెన్స్ రావడంతో అందులో ఎక్కించారు. అయితే, ఆస్పత్రికి చేరుకునేలోగా నాగేందర్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం గాయపడిన శ్రీకుమార్, ఈశ్వర్‌ను కూడా కలెక్టర్ గౌతమ్ సూచనలతో ఖమ్మం ఆస్పత్రి తీసుకెళ్లారు.

ఆందోళన, దాడి

విద్యార్థి నాగేందర్ స్వస్థలం కూసుమంచి మండలంలోని కోక్యాతండా. ఆయన తండ్రి బాలాజీ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మేరకు నాగేందర్ మృతి చెందినట్లు తెలుసుకున్న కుటుంబీకులు చేరుకుని 'మా కొడుకు మాకు కావాలి' అంటూ గుండెలవిసేలా రోదించిన తీరు అందరినీ కలిచివేచింది. అలాగే, పెద్దసంఖ్యలో చేరుకున్న బంధువులు, తండావాసులు ప్రిన్సిపాల్, ఉద్యోగుల నిర్లక్ష్యమే ఘటనకు కారణమని ఆరోపిస్తూ డార్మెటరీల అద్దాలు, ఫర్నీచర్ పగులగొట్టారు. ఆర్డీఓ స్వర్ణలత, ఖమ్మంరూరల్ ఏసీపీ బస్వారెడ్డి పరిస్థితులు సమీక్షించగా, సీఐలు జితేందర్‌రెడ్డి, రాజిరెడ్డి బందోబస్తు ఏర్పాటుచేశారు. ఘటన జరిగిన 40 నిమిషాల వరకు ప్రిన్సిపాల్, ఉద్యోగులు పట్టించుకోలేదని, సకాలంలో ఆస్పత్రికి తరలిస్తే నాగేందర్ బతికేవాడని తెలిపారు. ప్రమాదానికి కారణమైన విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని తెలిసినా సరిచేయించలేదని ఆరోపించారు.

సీపీఆర్ చేసినా దక్కని ప్రాణం

నాగేందర్‌ను ఆస్పత్రికి తీసుకొచ్చే క్రమంలో 108 సిబ్బంది సీపీఆర్ చేస్తూ వచ్చినా ఫలితం దక్కలేదు. కాగా, విద్యార్థి సంఘాల నాయకులు ఆస్పత్రికి చేరుకుని అక్కడే ఉన్న ప్రిన్సిపాల్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో పనులు చేయించడంతోనే ఈ ఘటన జరిగిందని ఆరోపించారు. టూటౌన్ పోలీసులు చేరుకుని వారికి నచ్చచెప్పినా వినకుండా ఆస్పత్రి ప్రవేశ ద్వారం వద్ద బైఠాయించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు నామాల ఆజాద్, ఇటికల రామకృష్ణ, ప్రవీణ్, వెంకటేశ్, మస్తాన్, శ్రీకాంత్, మల్సూర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని నవోదయ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధరావత్ కీమా నాయక్, నాగండ్ల దామోదర్‌రావు డిమాండ్ చేశారు. కాగా, ఖమ్మం ఆర్డీఓ స్వర్ణలత శనివారం రాత్రి విద్యాలయకు చేరుకుని వివరాలు ఆరా తీశారు. అయితే, ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయడమే కాక నాగేందర్ కుటుంబానికి రూ.50లక్షల పరిహారం చెల్లించి, అతడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని పలువురు డిమాండ్ చేశారు.



నాగేందర్ మృతదేహం



ఖమ్మం ఆస్పత్రిలో నవోదయ ప్రిన్సిపాల్‌తో నాయకుల వాగ్వాదం



రోదిస్తున్న నాగేందర్ తండ్రి బాలాజీ

ప్రిన్సిపాల్ సస్పెండ్

విద్యార్థి మృతికి బాధ్యుడిగా నిర్ధారిస్తూ నవోదయ ప్రిన్సిపాల్ ఏ.చంద్రబాబును సస్పెండ్ చేస్తూ నవోదయ విద్యాలయాల సమితి డిప్యూటీ కమిషనర్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

ముంపు బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం

కలెక్టర్ వీపీ గౌతమ్



మృతుడి భార్యకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంరూరల్: మున్నేరు ముంపు బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని కలెక్టర్ వీపీ గౌతమ్ వెల్లడించారు. మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి శనివారం ఆయన వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బాధితులకు భరోసా కల్పించడంతో పాటు పారిశుద్ధ్య పనుల విషయంలో సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే, ఖమ్మం రూరల్ మండలంలోని వరద బాధితులకు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, కలెక్టర్ గౌతమ్ ప్రభుత్వం తరఫున నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కాగా, నాయుడుపేటలోని రాంలీల ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే, ఖమ్మంలో మున్నేటి వరద ఉధృతిలో కొట్టుకుపోయి మృతి చెందిన ఖమ్మంరూరల్ మండలంలోని జలగంనగర్‌కు చెందిన పెంద్ర సతీశ్ కుటుంబానికి ప్రభుత్వం రూ.4 లక్షల పరిహారం ప్రకటించింది. ఈ చెక్కును కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి తదితరులు సతీశ్ భార్య శృతికి అందజేశారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, మధుసూదన్, జెడ్పీ సీఈఓ వీవీ అప్పారావు, మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఆర్డీఓ స్వర్ణలత, మునిసిపల్ డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి, ఎంపీపీ బెల్లం ఉమ, తహసీల్దార్లు శైలజ, సుమ, నాయకులు పగడాల నాగరాజు, ఎ.వరప్రసాద్, బెల్లం వేణు తతదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటను ధ్వంసం చేసిన అటవీ అధికారులు

పెనుబల్లి: పోడు రైతులు సాగు చేసుకుంటున్న పత్తి పంటను శనివారం అటవీ శాఖాధికారులు ధ్వంసం చేశారు. మండలంలోని బ్రహ్మళకుంటకు చెందిన రైతులు ఆరు ఎకరాల భూమిలో సాగు చేసిన పత్తి మొక్కలను తొలగించారు. ఈ నెల 7వ తేదీన ప్రభుత్వం ఐదుగురు రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేయగా పత్తి గింజలు నాటడంతో ఇప్పుడు అధికారులు తొలగించారని వాపోయారు. ఈ విషయంపై తల్లాడ ఎఫ్ఆర్‌ఓను వివరణ కోరగా పట్టా భూమిలో కాకుండా పక్కన పంట సాగు చేశారని, విచారణ అనంతరం కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.



పత్తి మొక్కలు తొలగిస్తున్న అధికారులు

కొండపల్లి వాహనానికి వరంగల్‌లో చలానా

నేలకొండపల్లి: నేలకొండపల్లికి చెందిన పసుమర్తి లావణ్యకు చెందిన హోండా యాక్టివ్ బైక్ ఉండగా, ఆమె స్థానికంగా వాహనాన్ని ఉపయోగిస్తారు. అయితే, ఈనెల 22న హనుమకొండ జిల్లా మట్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో హెల్మెట్ లేకుండా వాహనం నడిపినట్లు చలానా జారీ అయింది. ఈమేరకు శనివారం మెసేజ్ చూసుకున్న ఆమె మాట్లాడుతూ హనుమకొండకు వెళ్లకుండానే చలానా జారీ అయినందున అధికారులు స్పందించాలని కోరారు.

ఆభరణాల మేళాకు విశేష స్పందన



ఆభరణాలను పరిశీలిస్తున్న మేయర్ నీరజ తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: వేగ జ్యూయలర్స్ ఆధ్వర్యాన ఖమ్మంలోని హోటల్ గ్రాండ్‌గాయత్రిలో ఆభరణాల ప్రదర్శన, అమ్మకానికి గాను మేళా ఏర్పాటుచేశారు. రెండు రోజుల పాటు సాగనున్న మేళాను మేయర్ పునుకొల్లు నీరజ, మమత కళాశాల బాధ్యులు పువ్వాడ జయశ్రీ, హార్వెస్ట్ విద్యాసంస్థల బాధ్యులు పార్వతి శనివారం ప్రారంభించి మాట్లాడారు. ఈ మేళాను నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. సంస్థ ప్రతినిధులు వనమా నవీన్, వనమా సుధాకర్ మాట్లాడుతూ అన్ని శుభకార్యాలకు కావాల్సిన వందలాది డిజైన్లలో ఆభరణాలను ప్రదర్శనలో అందుబాటులో ఉంచామని తెలిపారు. బంగారు ఆభరణాల తయారీ చార్జీలో 50 శాతం తగ్గింపు, పోల్కి జ్యూయలరీపై మేకింగ్, వేస్టేజ్ చార్జీలు ఉండవని తెలిపారు.

గెట్టు పంచాయతీలో కొడవలితో దాడి

కారేపల్లి: చేను గెట్ల విషయమై జరిగిన ఘర్షణలో కొడవలితో దాడి చేయగా ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని పోలంపల్లికి చెందిన భూక్యా భద్రుకు ఊరు చివర వరి పొలం ఉంది. కాగా, భాగ్యనగర్‌తండా గ్రామానికి చెందిన ధారావత్ హనుమ, ధరావత్ నాను పొలాలు భద్రు పొలం పక్కనే ఉండగా, గెట్టు విషయంలో హనుమ, నానులు భద్రుతో ఘర్షణపడ్డారు. ఈక్రమంలో కొడవలితో భద్రుపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చగా బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.రామారావు తెలిపారు.

100 క్వింటాళ్ల బియ్యం పంపిణీ



బియ్యం సిద్ధం చేస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలో మున్నేరు వరద బాధిత కుటుంబాలకు జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన శనివారం వంద క్వింటాళ్ల బియ్యాన్ని పంపిణీ చేశారు. వరదలతో కుటుంబాలు సర్వం కోల్పోయిన నేపథ్యాన రూ.4.40 లక్షల విలువైన బియ్యాన్ని పది కిలోల చొప్పున వెయ్యి కుటుంబాలకు అందజేసినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొమ్మా రాజేశ్వరరావు తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి జువ్వాజి నగేశ్, కోశాధికారి సీహెచ్ నగేశ్, మధు, బాలకృష్ణ ఆధ్వర్యాన పంపిణీ కొనసాగిందని వెల్లడించారు.

మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారయత్నం

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరులో మతిస్థిమితం లేని యువతిపై అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఘటనపై యువతి సోదరి చేసిన ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేశామని ఎస్ఐ రాజేందర్ తెలిపారు.

భూతగాదాలో గాయపడిన వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం: మండలంలోని మేకలతండా పరిధి కుక్కలతండాలో జరిగిన భూతగాదాలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివాదం కొనసాగుతున్న భూమిలో ఈనెల 23న బోడ రవి దున్నుతుండగా ఇస్లావత్ భద్రు(52), బాలు, వెంకన్న తదితరులు వెళ్లి అడ్డుకున్నారు. దీంతో బోడ రవి, ఇస్లావత్ శివ, కిషన్‌తో పాటు పలువురు భద్రుపై కర్రలతో దాడి చేయగా తీవ్ర గాయాలయయ్యాయి. దీంతో ఆయనను హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి

ఖమ్మంక్రైం: రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని మహిళ (55) మృతి చెందింది. జీఆర్పీ ఎస్ఐ భాస్కర్‌రావు తెలిపిన వివరాలు... ఇద్దరు మహిళలు ఖమ్మం నర్తకి థియేటర్ వద్ద పట్టాలు దాటుతుండగా వేగంగా వస్తున్న రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒక మహిళ మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఆమె మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు మార్చురీకి తరలించారు. కాగా, మృతురాలు యూపీ లేదా బీహార్‌కు చెందిన వలస కూలీ అయి ఉండొచ్చని గాయపడిన మహిళ స్పృహలోకి వస్తే వివరాలు తెలుస్తాయని ఎస్ఐ వెల్లడించారు.

భవనం పైనుంచి పడి బెంగాల్ కార్మికుడు..

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని టూటౌన్ ప్రాంతంలో నిర్మిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రి భవనం పైనుంచి పడిన ఓ కార్మికుడు మృతి చెందాడు. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాకు చెందిన షేక్ ఆకాష్.. ఆస్పత్రికి సంబంధించి టైల్స్ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ప్రమాదవశాత్తు జారి పైనుంచి పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

వరదను జయించిన గోమాతలు!



వరద సమయాన శివాలయంలో ఆవులు (ఫైల్), (ఇన్‌సెట్) ప్రాణాలతో బయటకు వచ్చిన ఆవు

ఓ పక్క మున్నేరు ఉధృతి పెరుగుతుండడంతో ప్రజలంతా తలోదిక్కుకు వెళ్లిపోగా.. శివాలయంలో ఉన్న ఆవులు మాత్రం వరద తాకిడిని తట్టుకుని నిలబడ్డాయి. తాజాగా ఖమ్మంలో మున్నేరు వరద పోటెత్తగా ఖమ్మం రూరల్ మండలం కేబీఆర్ నగర్‌ను నీరు ముంచెత్తింది. దీంతో స్థానికులు ఇళ్లు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు. కానీ కేబీఆర్ నగర్ పక్కనే ఏటి ఒడ్డున ఉన్న శివాలయంలో కట్టేసిన రెండు ఆవులు అలాగే ఉండిపోయాయి. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 20 గంటలు ఉండగా.. పెరిగిన వరద ఉధృతిని తట్టుకోలేక అవి కూడా కొట్టుకుపోయాయి. చివరకు మళ్లీ ఆవులు రెండు శనివారం ఉదయం ఒడ్డుకు చేరుకోగా.. అర్చకులు, స్థానికులు చేరదీసి సపర్యలు చేశారు. – ఖమ్మంరూరల్